# దాఖలా

''పడమట గది పెణక జారిపోయింది.''

పార్వతమ్మ చెప్పడం శంకరశాస్త్రి చెవిని పడకపోలేదు. అతను ఆ దృశ్యాన్ని చూడనూ చూశాడు. ఉస్సురని నిట్టూర్చాడు.

మూడురోజులై ఎడతెరపి లేకుండ ఒకటే ముసురు 'జీ' మని రొజ్జగాలి.

నాలుగిళ్ల మండువా, కొత్తగా వెలసిన సిమెంటు కాంక్రీటు బంగళాల వరుసలో పేరంటంలో పట్టుచీరల మధ్య పేద ముత్తయిదువులా ముడుచుకుపోయింది.

పదేళ్ల క్రిందటేమో బుగతల రోజుల్లో ఊరికి దూరంగా అర ఎకరం జాగాలో మధ్యగా నాలుగిళ్ల లోగిలి పంచాంగాలు రాసే సిద్ధాంతిగారు కట్టించారు.

''ఏమిటోనమ్మా! వాడే పని చేస్తాడో వాడికే తెలియదు'' సిద్ధాంతిగారిని పెంచుకున్నావిడ అందట. సిద్ధాంతిగారిని దత్తత చేసుకున్నావిడ మాట లెందుకో ఒక తరంవారు తరువాత తరంవారికి చెబుతూనే వచ్చారు. ఆవిడలో ప్రత్యేకత ఏమిటంటే దత్తత చేసుకున్న కొడుకుతో వేరైపోయి చివరి రోజులు మాత్రం సిద్ధాంతి లోగిలిలో గడిపిందట ఆవిడ కేదో భవిష్యజ్ఞానం ఉండేదనీ, తను పెంచుకున్న బిడ్డ సిద్ధాంతి అవుతాడని ఆమెకు తెలుసుననీ చెప్పుకునేవారట.

సిద్ధాంతి ఇల్లు కట్టడం అందునా ఊరికి కోసెడు దూరంలో ఆరోజుల్లో - తల్లి వద్దంటున్నా కట్టడంలో ఆంతర్యం ఉంటుందని ఎవరూ అనుకోలేదు.

సిద్ధాంతికి కడుపునిండా బిడ్డలు. ఆరుగురు కొడుకులు, నలుగురు కూతుళ్లు.

ఒక్కొక్క కుటుంబంలో ఒక్కొక్క వ్యక్తి అటు ఆరు తరాలు, ఇటు ఆరు తరాల వైభవం పుణికిపుచ్చుకుని దేదీప్యమానంగా వెలగిపోతాడని, ఆ వెలుగు వెలుగే కానీ ఆ తరువాత నాలుగైదు తరాల వరకు ఆ కుటుంబంలో ఎవరూ అంత ఎత్తుకి కాదు సరికదా అందులో పదవవంతు సుఖానికైనా నోచుకోరట. ఇది కేవలం మూఢనమ్మకం క్రింద తోసిపారేయడానికి వీలు లేకుండా శాస్త్రిగారి స్వానుభవమే చెబుతుంది.

సిద్ధాంతిగారంటే చుట్టూ ఓ వంద కోసుల కైవారంతో తిరుగులేని ఘనాపాఠిగా, సిద్ధాంతిగా, శ్రోత్రియుడుగా పేరు. ప్రభువుల ఆశ్రయమైతే నేం, లౌకిక జ్ఞానం అయితే నేం, ఆయనను పెంచుకున్న తల్లి అదృష్టమైతేనేం సిద్ధాంతిగారి పేరులాగే ఆస్తీ పెరుగుతూ వచ్చిందట.

ప్రభువుల ప్రాపకంలో శాస్త్రులవారి పాండిత్యంతో యజ్ఞాలనో, యాగాలనో అన్నీ ఆయన యాజమాన్యంలోనే జరిగేవి. రాజుగారు అగ్రహారం రాసిచ్చాడు. రాజనగరి శివార్లలో ఓ అర ఎకరం జాగా ఇచ్చి ఇల్లు కట్టుకోడానికి కలప ఇస్తామన్నారట. ఏణ్ణర్థం శ్రమపడి దగ్గర ఉండి సిద్ధాంతిగారు ఇల్లు కట్టించారు.

సిద్ధాంతిగారి పిల్లల్లో ఆరుగురు కొత్త ఇంటిలోనే పుట్టారు. ఆరు బాలసారెలూ, పెళ్లిళ్లూ ఘనంగా చేశారు. ఊరు ఊరంతా భోజనాలకీ వచ్చారు. లౌక్యుల సంతర్పణా, శ్రోత్రియుల సమారాధనా, బీదా సాదా ప్రజలకు అన్నదానం జరిగాయి.

సిద్ధాంతిగారి పిల్లల పెళ్లిళ్లూ ఆ లోగిలిలోనే జరిగాయి.

ఆయన తదనంతరం అప్పటికి చదువుకుంటున్న ఇద్దరు మగపిల్లలు తప్ప, పెద్దవాళ్లు నలుగురూ

ఉద్యోగాలంటూ దూరాభారం వెళ్లిపోయారు. ఆ వ్యవసాయం చేయించే వాళ్లు లేక భూములు రైతులికిచ్చేశారు.

తల్లి పోయిన తరువాత రైతుల మీద యజమాయిషీ కొంచెం సన్నగిల్లింది. సిద్ధాంతిగారి పెద్ద కొడుకు పోయిన తరువాత, మూడో కొడుకు తన పినతండ్రితో ఆ ఇంటిలో మిగిలాడు.

పినతండ్రీ పెళ్లీ పేరంటం లేకుండానే పోయాడు. దానితో రెండో తరంలోని మగబిడ్డ మనవడే శంకరశాస్త్రి.

శంకరశాస్త్రి పెద్ద లోగిలికి వారసుడు. అతని తండ్రి తోబుట్టువులూ, తన తోబుట్టువులూ సామాన్య జీవితాలే గడిపినా, ఎవరూ ఆ ఇంటికి ఎప్పటికప్పుడు కావలసిన పోషణ చేయలేకపోయారు. లంకంత కొంప సున్నం వేయించాలంటేనే బోలెడు అవుతుంది. అది చేతకాకపోవడంతో గోడలు చవుడుదేరిపోయి పెల్లలు పెల్లలుగా రాలిపోయాయి. వానలకి కారిపోయి, కారిపోయి పెంకులు వదులై ఒక్కొక్క పెణక జారిపోతోంది.

పూర్వపు రోజులు కావాయె. పని దొరకడానికి కావలసిన శక్తి లేక, ఉద్యోగాలకు కావలసిన ఇంగ్లీషు చదువులూ లేక చితికిపోయిన కుటుంబంలోని శంకరశాస్త్రి గారికి మాత్రం ఇద్దరే పిల్లలు - ఒక ఆడపిల్ల, ఒక మగబిడ్డ.

శాస్త్రిగారు కొద్దిగానే చదువుకున్నా నోటి మంచిమనిషి. పూర్వకాలపు పేరు వల్ల నమ్మకంతో నైతేనేం, గౌరవం వల్లనైతేనేం వచ్చిన వాళ్లకి పెద్దదిక్కుగా సలహాలిస్తూ ఉండేవాడు. ఆయన భార్య సోమిదేవమ్మ కూడా ఆయనకు తగిన భార్యగా - పూజా, పునస్కారం, మడీ,తడీ.... ఉన్నంతలో ఓ కూరాకు ఒకరికి ఇవ్వాలనే నమ్మేది.

భార్యా భర్తలిద్దరూ ఒకరికొకరు చెప్పకుండా ఒకే విషయం గురించి ఆలోచిస్తున్నారు - అమ్మాయి పెళ్లెలా? పది క్లాసులూ అయ్యాక మగబిడ్డ చదువు సంగతెలా ?

- నాటి కొక్క దైవము లేడా అనుకుని మనసులో దేవుణ్ణి ప్రార్థించి, ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి వంకే చూస్తూ పరాకులో పడిపోయింది.

- చుట్టూ బజారు పెరిగిపోయింది. పెద్ద పెద్ద బంగళాల మధ్య చిక్కుకుపోయిన లోగిలి పెణకలు జారిపోయి ఉన్నట్టే ఏమీ చేయడానికి తోచక శాస్త్రిగారు గోడకు చేరగిలబడి మంచం మీద కూర్చున్నారు.

ఆయన వంక చూడడానికి సోమిదేవమ్మగారికి ధైర్యం చాలడంలేదు.

ఆ కళ్లలోని దీనత్వం ఆమె చూడలేదు. నిండుగా ఉండే మనిషి కష్టం అనుభవించడానికి ఆమెకు భయం లేదు. కాని ఆయన కళ్లల్లో మెదిలే నైరాశ్యం - విచారంతో వచ్చిన ఆర్ద్రతా చూస్తే ఆమెకు గుండె చెరువైపోతోంది.

ఆయన కొచ్చిన దగ్గు తెర ఆమె బింకాన్ని సడలించింది - ఇప్పుడు ఆయన కళ్లల్లో నీళ్లే! లేచి గ్లాసులో మంచినీళ్లు పట్టుకొని ఆయన దగ్గరకు వెళ్లి నడుమురాస్తూ కూర్చుంది.

కాసేపటికి దగ్గు నిమ్మళించింది. అయినా నోటి మాట రావడం కష్టమవుతుండగా '' సోమీ! మన పిల్లల్ని చూస్తే కడుపులో దేవేస్తోందే ... వాళ్లని కన్నాంగానీ, వాళ్లకేం చెయ్యగలిగాం ?... ఈ ఊరొదలి వెళ్లిపోదాం అనుకున్నా ఇంతకంటే మరోలా బ్రతికే దిక్కు కనబడటంలేదు ! నీ

ధైర్యంలో ఓ పిసరు నాకివ్వవే !''

ఆయన గొంతు మళ్లా పూడుకుపోయింది.

'' అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. తెలిసి మనమే పాపమూ చేయలేదు... ఆవేశం వల్లా, దుఃఖంవల్లా చక్కబడే పరిస్థితీ కాదు మనది. దేవుడొక్కడే మనకి శరణ్యం .. నేను వెర్రిబాగులదాన్ని ఎంత దిగమింగుకుందామన్నా అది చేతకాక బయటపడి పడమటిగది గురించి చెప్పి మీ మనసు కష్టపెట్టాను. పాపిష్టి దాన్ని ... '' ఆమె కళ్లల్లో నీళ్లు నింపుకుంది.

శాస్త్రిగారు ఆమె తల మీద చెయ్యి వేసి '' ఊరుకో! ఊరుకో ! '' అన్నారు.

'' బాబూ, పంతులుగారున్నారా ?'' అంటూ ఎవరో బయటి నుంచి పిలవడం ముందు సోమిదేవమ్మ చెవినే పడింది.

'' ఎవరు బాబూ !'' అంటూ బయటకు వచ్చింది.

'' బాబుగారున్నారామ్మా ! మా అయ్యగారొచ్చారు. బయట బండిలో ఉన్నారు.'' తెల్లకోటు, తెల్లటోపీ ఆసామి చెప్పాడు.

బయటకు తొంగి చూసింది. ద్వారం ఎదురుగా తెల్లటి కారు.

'' వారిని రమ్మను బాబూ! వారు లోపలే ఉన్నారు పిలుస్తా !''

శాస్త్రి గారు బయటకు రాగానే –

'' రామనాథం దొరగారని నూనె మిల్లు యజమాని తమర్ని చూడటానికి వచ్చారు ... సెలవయితే... '' డ్రైవరు అడిగాడు చాలా మర్యాదగా.

'' రమ్మనండి !'' అని ఆయన కారు దిగి వచ్చేలోగా ఉత్తరీయం గుండెల మీద కప్పుకున్నారు శాస్త్రిగారు.

'' దయచేయండి !''

'' అయ్యా ! శాస్త్రులవారూ ! కులాసా! '' అంటూ రామనాథం దొరగారు లోపలికి వచ్చారు.

'' ఏదో ఇలా ఉన్నాం.... భగవదనుగ్రహం !''

'' అంతే మరి. ఎవరికైనా అంతే కదా శాస్త్రులవారూ ! తమ ఆశీర్వచనం కోరి వచ్చాను. విషయం క్లుప్తంగా చెబుతా. మా పెద్ద గుమాస్తాగారొస్తానులే అన్నారు. కాని, నేనే తమ దర్శనం చేసుకోవడం ధర్మమని వచ్చాను. మాకు కొత్త వీధిలో ఓ ఇల్లుంది. చిన్నదేననుకోండి. ఓ నాలుగు వందల గజాలు, కాంక్రీటు మేడ ... తమరుండగా ఓ అయిదువందల రూపాయలు అద్దె వస్తుంది. తమరూ, అమ్మగారూ వచ్చి చూసుకున్నాక వివరాలు తమకు మనవి చేసుకుంటాను.''

'' తమరనే దేమిటో నా కర్థం కావటంలా ...''

''అమ్మగారినే బయలుదేరి రమ్మనండి ... దోవలోనే చెబుతా...''

లోపల నుంచి సోమిదేవమ్మ విషయమేమిటా అనుకుని వస్తుండగా కారు శబ్దం వినబడింది.

'' దొరగారి భార్యగారు'' అంటూ డ్రైవరు మళ్లీ వచ్చాడు.

'' రండమ్మా రండి ...'' సోమిదేవమ్మ ఆవిడను ఆహ్వానించింది.

'' మిమ్మల్ని మా ఇంటికి తీసుకువెళ్లాలనే నేనూ వచ్చాను. ఇల్లు ఖాళీగానే ఉంది. మా వారి స్వార్జితమే. దయచేయండి... బయలుదేరుదామా ?'' అంది ఆవిడ భర్త వంక చూస్తూ..

"అయ్యా తమకు ఉపకారం చెయ్యడమని గొప్ప చెప్పుకోలేను కాని తమ ఆశీర్వచనం గురించి - మా కొత్త ఇల్లు తమకిచ్చి, తమ ఇల్లు తీసుకుని వ్యాపారం మలుపు తిప్పుకుని పెంచుకోవాలనే ఆశతో వచ్చాను. నేటి ధర ప్రకారం తమ ఇల్లూ, చుట్టూ జాగాకి వచ్చే డబ్బు కావాలంటే ఇచ్చేస్తాను గానీ, మీరు ఇల్లులేని వాళ్ళవడం వల్ల నేను బాగుపడను. మీ ఆస్తి మీపూర్తి సమ్మతి మీద మీ ఆశీర్వచనంతో కావాలి. నా మేడకి మూడు లక్షలైంది. దాన్ని రెండున్నర లక్షలకి మీకిచ్చి మీ ఇంటికి నాలుగు లక్షలివ్వాలని నేననుకుంటున్నాను.

" మీరూ మీ బిడ్డల విషయంలో చీకూ, చింతా లేకుండా ఉండవచ్చు. మీరు ఆలోచించుకుని చెప్పండి నెల రోజులైనా ఫరవాలేదు!"

సోమిదేవమ్మ ఆలోచనలో పడి భర్తను చూసింది.

" ఇంట్లోకి రండమ్మా ! " అంటూ ఇంటావిడ లోపలకు తీసుకువెళ్లింది. కాసేపయ్యాక ఆవిడ, ఆవిడ భర్తా స్వయంగా శాస్త్రిగారినీ, వారి భార్యనీ ఇంటికి దిగబెట్టారు.

"నా కోరిక ఫలించిందండీ. అమ్మాయి పెళ్లీ అబ్బాయి చదువు రెండూ సాధ్యమవుతాయి. మనకి ఓ అయివేజూ ఏర్పడుతుంది... ఏమిటీ అలా ఉన్నారు ! "

"నా పెద్దలిచ్చిన ఆస్తి ... దీన్ని ... "

" దుర్వినియోగం చేయడం లేదుగా ... వాళ్లిద్దరూ మంచి చెడ్డలు తెలిసినవాళ్లు వాళ్లిస్తామన్న డబ్బులో సగం ఇస్తామని కబురు చేసినా, మనం ఒప్పేసుకునే వాళ్లమే - కాని మనపూర్తి సమ్మతితో, ఆశీర్వాదంతో ఇల్లు మనం వాళ్లకి దఖలుపరచాలన్న వాళ్ల ఉద్దేశంలో పెద్ద మనసే ఉంది.

" ఇక మన విషయమా ... మన పెద్దల ఆశీస్సులు మనకున్నాయనడానికి ఇదే దాఖలా - ఇక నేను విప్పి చెప్పనక్కరలేదనుకుంటాను !"

దేవుడి గది వంక వెళుతూ సోమిదేవమ్మ అంటున్న మాటలు విని తృప్తిగా నిట్టూర్చారు శంకరశాస్త్రిగారు.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

11.7. 90